

హైదరాబాద్ వార్త

# విస్తరిస్తున్న చికున్‌గున్యా

**-జ్వరం, కీళ్లు, కండరాల నొప్పులతో ఆసుపత్రులకు క్యూ**
**-దోమ కుట్టిన 3-7 రోజుల్లో బయటపడుతున్న వ్యాధి లక్షణాలు**
**-కొరవడిన దోమల నివారణ చర్యలు**



**హైదరాబాద్, జూలై 16 ప్రభాతవార్త,**
దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిట్ వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వీటిలో చికున్‌గున్యా తీవ్రమైన ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ప్రస్తుతం చికున్‌గున్యా నగరంలో విస్తరిస్తోంది. ఈ వ్యాధి లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల తాకిడి ఆందోళన కలిగిస్తోంది. చికున్‌గున్యా అనేది దోమల ద్వారా సంక్రమించే ప్రాణాంతక వ్యాధి. ఇది ఎముక, కీళ్ల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఇది ఫ్లానీ వైరస్ కారణంగా సంక్రమిస్తుంది. దీనినే చిక్ వైరస్ అని కూడా పిలుస్తుంటారు. ఈ వ్యాధి సోకిందంటే నరకప్రాయమే. ఎడిస్ ఈజిప్టి అనే దోమ కాటు వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. చిగున్‌గున్యా వైరస్‌ను మోసుకెళ్లే దోమ మనిషిని కుట్టినప్పుడు ఈ వ్యాధి సోకుతుంది. వ్యక్తికి నేరుగా కాకుండా దోమల కాటు ద్వారా ఇది శరీరంలోకి ప్రవేశిస్తుంది. దోమ కుట్టిన 3-7 రోజుల మధ్య వ్యాధి లక్షణాలు బయటపడతాయి. ఒకసారి ఈ వైరస్ మన శరీరంలోకి ప్రవేశిస్తే చాలు కీళ్లు, కండరాల్లో తీవ్రమైన నొప్పి వస్తుంది. అలాగే జ్వరం కూడా ఉంటుంది. కొద్దిరోజుల్లో జ్వరం తగ్గిపోయినా కీళ్ల నొప్పులు నెలల తరబడి వేధిస్తుంటాయి.

### వ్యాధి లక్షణాలు..

చికున్‌గున్యా సంక్రమణ లక్షణాలు డెంగ్యూ లక్షణాల వలే పోలి ఉంటాయి. దోమ కాటు వల్ల ఇన్ఫెక్షన్ సోకిన కొద్ది రోజులకే ఈ లక్షణాలు కనిపిస్తాయి. 50 ఏండ్ల వయసు దాటిన వారిలో ప్రత్యేకించి రోగ నిరోధక శక్తి తగ్గిపోయివారిలోనే దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకినవారిలో కాళ్లు, చేతుల కీళ్లు నొప్పిగా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో కీళ్లలో వాపు కూడా వస్తుంది. ఈ నొప్పులు నాలుగైదు వారాలు మొదలుకొన్ని నెలల వరకు కొనసాగాయి. వైరస్ సోకిన మొదటి రోజుల్లో తీవ్రమైన తలనొప్పి కూడా ఉంటుంది. తీవ్ర అలసటగా ఉంటుంది. స్కిన్ రాషెస్ కనిపిస్తాయి. ఆకలి తగ్గిపోవడంతోపాటు వాంతి, వికారంగా ఉంటుంది.

### కోలుకోవటం కష్టమేనా..

చికున్‌గున్యాకు ఇప్పటి వరకు కచ్చితమైన చికిత్స ఏదీ అందుబాటులో లేదు. వైద్యులు జ్వరం తగ్గేందుకు మందులు ఇస్తున్నారు. డబ్ల్యుహెచ్‌వో ప్రకారం..వైరస్‌ను ఎదుర్కొవడానికి టీకా లేదా ప్రత్యేకమైన మందులు లేవు. అందువల్ల చికిత్స వ్యాధి లక్షణాలను తగ్గించడంపైనే ఉంటుంది. యాంటిపైరెటిక్స్, నొప్పి నివారణ మందులు, ద్రవాలు ఎక్కువగా తాగడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం చేయాలి. ఇంటిపట్టున ఉండి శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉండేందుకు ఎక్కువ మొతాదులో నీరు, కొబ్బరినీరు తాగాలని సెలవిస్తున్నారు. అలాగే ఇంట్లో వంటలకు వాడే మసాలా దినుసులతో నొప్పులను తగ్గించుకోవచ్చునని అయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు. నివారించడానికి మార్గాలు..

దోమలను తరిమికొట్టే లోషన్లను ఉపయోగిస్తున్నారు. స్థిరమైన వ్యర్థ పదార్థాలను క్రమం తప్పకుండా తొలగించాలని, చికున్‌గున్యా కేసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసిస్తుంటే పూర్తిగా చేతులు, కాళ్ల నిండుగా ఉండేలా దుస్తులు ధరించాలని, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# అవినీతికి కేరాఫ్ కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ, డీఈల కార్యాలయాలు

**-రెచ్చిపోతున్న అవినీతి అనకొండలు -అభివృద్ధి పనుల్లో లెక్కలేనంత అక్రమాలు..**

**కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, జులై15 ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసి కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ కార్యాలయంతో పాటు డీఈల కార్యాలయాలు అవినీతి, అక్రమ వసూళ్ళకు అడ్డాగా మారాయి. ఎస్‌ఈ, డీఇల కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ ముగ్గురు అవినీతి అధికారులు గతంలో వారు పని చేసిన ప్రాంతాలతో పాటు ఇక్కడ పనిచేసిన సమయంలో భారీ అక్రమాలకు పాల్పడిన వీరికి రూ.కోట్ల విలువ చేసే అక్రమాస్తులు నగరం శివార్లలో ఉన్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. రూ.లక్షలు ఖర్చుపెట్టి ఎస్‌ఈ కార్యాలయంలో సీటుని దక్కించుకున్న కీలక అధికారి కార్యాలయాన్ని అక్రమార్జనకు నిలయంగా మార్చేసి డీఇలు, ఏఇలు వర్క్ ఇన్స్‌పెక్టర్లతో తన అవినీతి దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. టెండర్లలో భారీ అక్రమాలతోపాటు రోడ్లు, పార్కుల అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడింది. కమిషన్లకే పరిమితమైన కొందరు ఇంజనీరింగ్ విభాగం అధికారుల అండదండలతో కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులను చేపడుతూ నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. ఎస్‌ఈ, డీఈల కార్యాలయాల్లో ప్రతి పనికి ఓ రేటు కట్టి మామూళ్ళు ఇస్తేనే ఫైళ్ళు కదలని పరిస్థితి నెలకొంది. అవినీత నిరోధక శాఖ (ఏసీబీ) నిఘా పెడితే ఎస్‌ఈ కార్యాలయంలో ఓ కీలక అధికారితోపాటు ఓ ఇద్దరు డీఇలు కొందరు ఏఇల అక్రమ వసూళ్ళ బాగోతం బయటపడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు

**అభివృద్ధి పనుల్లో లెక్కలేనంత అక్రమాలు..**

**నాణ్యతకు గండి..**
అభివృద్ధి పనులకు నిర్వహించే టెండర్లలో భారీ అవకతవకలతోపాటు పనుల్లో కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో నాణ్యత లేక వేసిన కొన్నాళ్లకే అద్వాన్నంగా తయారవుతున్నాయి. కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్ బోయిన్‌పల్లి, ఆల్విన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎటు చూసినా గుంతల రోడ్లు, చిన్న చినుకుకే చిద్రమయ్యే రోడ్లు, ఏటా రూ.కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా ప్రజలకు నరకయాతన తప్పడం లేదు. కొందరు అధికారుల అవినీతి, కాంట్రాక్టర్ల నిర్లక్షం కారణంగా అంతర్గత రోడ్లు ఆద్వాన్నంగా తయారవుతున్నాయి. ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతలమయంతో దర్శనమిస్తున్నాయి. ప్రతి సంవత్సరం కోట్లాదిరూపాయల్ని వెచ్చించి కొత్త రోడ్లతో పాటు రోడ్ల మరమ్మతులకు వెచ్చిస్తున్నా కాంట్రాక్టర్లు నాణ్యత లేకుండా చేపట్టే పనులతో కొన్ని నెలలకే రోడ్లన్నీ చెడిపోయి గుంతలు పడుతున్నాయి. అద్వాన్నపు రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్వాన్నంగా తయారైన రోడ్లపై రాకపోకల్ని సాగిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. అబివృద్ధి పనుల కోసం ఏటా రూ.కోట్ల రూపాయల్ని ఖర్చుచేస్తున్నప్పటికీ ఓ వైపు ఇంజనీరింగ్ విభాగం అధికారులు మరో వైపు కాంట్రాక్టర్లు కుమ్మక్కవుతూ రూ.కోట్లాది రూపాయల్ని తమ జేబుల్లో వేసుకుటూ జిహెచ్ఎంసిని దివాళా తీయిస్తున్నారు. తూతూ మంత్రంగా అభివృద్ధి పనులను చేపట్టి ఇష్టారాజ్యంగా నిధులను బొక్కేయడం కోసమే పైపై మెరుగులు దిద్దుతున్నారని మరమ్మతులు పనులు చేపట్టి ఆపనులను నిబంధనలకు అనుగునంగానే వేశామని చెబుతూ అధికారులు బిల్లులు నొక్కేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**అవినీతికి కేరాఫ్ కార్యాలయాలు**
కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ కార్యాలయంతో పాటు డీఇల కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ ముగ్గురు అధికారులు అవినీతికి కేరాప్ అడ్రస్‌గా మారారు. జిహెచ్ఎంసి కమిషనర్ కార్యాలయం అండదండలతో అధికారమే పెట్టుబడిగా ఎస్‌ఈ, డీఇల కార్యాలయాల్లో కీలక అధికారులు చక్రం తిప్పుతున్నారు. ఏఇలు, వర్క్ ఇన్స్‌పెక్టర్లతో తమ వసూళ్ళ దందా కొనసాగిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవల్ని అందించాల్సిన ఆ ముగ్గురు అధికారులు మామూళ్ళ దారి పట్టారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి ప్రస్తుత పోస్టులోకి వచ్చిన సదరు అధికారులు జేబులు నింపుకోవడం కోసం ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రతి పనికొక రేటు పెట్టి తమ అవినీతి దందా కొనసాగిస్తున్నారు. ఎంతో కొంత ఇస్తే కాదు అంటూ తాము అడిగినంత ఇవ్వాల్సిందేనంటూ పనులు చేయకుండా ముప్పతిప్పలు పెడుతున్నట్లు తెలిసింది. ప్రతి పనికీ ఓ ధరను ముందే సిద్ధం చేసి మరీ వసూళ్ళకు దిగుతున్నారు. జేబులు నింపుకోవడమే లక్ష్యంగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కొందరు అధికారుల మూలంగా నెలలతరబడి తమ పనులు క్లియర్ కావడం కోసం కాంట్రాక్టర్లు పడిగాపులు కాస్తున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

# ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌లో వర్షానికి కుంగిన రోడ్డు

**-కారిడార్ పిల్లర్ల వద్ద గుంతలు**
**-పనుల నాణ్యతపై అనుమానాలు**



ఉప్పల్ ప్రధాన రహదారిలో కారిడార్ పిల్లర్ వద్ద కుంగిన రోడ్డును



**ఉప్పల్, జూలై 16 ప్రభాతవార్త :**
ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్ల వద్ద ఇటీవల కురిసిన వర్షానికి భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళ గుంతలు కనిపించకపోవడంతో అందులో ఒక కారు టైరు సగం వరకు పడిపోయింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ 2018లో పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ దివాళ తీయడంతో ఇటీవల కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌లు పనులను రద్దు చేసినట్లు ప్రకటించారు. మరో నెలలో పనులు కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని కొద్ది రోజుల క్రితం ప్రకటించారు. అయితే ఇదిలా ఉండగా గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఉప్పల్ ప్రధాన రహదారిలోని ఎలివేటెడ్ కారిడార్ రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మధ్యలో గతంలో వేసిన మట్టి పైపులు ఉండడంతో కాంట్రాక్టర్లు వాటిని అదే విధంగా వదిలివేసి మట్టితో నింపివేశారు. వర్షానికి పైపుల మధ్య ఖాళీ ఏర్పడడంతో అవి దెబ్బతిని పగిలిపోయాయి. దీంతో రోడ్డు మధ్యలో పార్కింగ్ చేస్తున్న వాహనాలు అకస్మాత్తుగా అందులో పడిపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం రాత్రి కారిడార్ పిల్లర్ల మధ్య పార్కు చేసిన ఒక కారు టైరు వత్తి డికి పెద్ద గుంత ఏర్పడింది. దీంతో అతి కష్టం మీద అతను తన కారును తీసుకుని వెళ్లిపోయారు. ఉదయం వరకు అలాగే ఉండడంతో రోడ్డు వెంట వాహనదారులు దీనిని గమనించి అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆర్ అండ్‌బి అధికారి డిఇ సరిత, జిహెచ్ఎంసి ప్రాజెక్ట్ ఇంజనీర్ రోహిణి, మున్సిపల్ ఇంజనీర్ ఎల్. నాగేందర్, డిఇ నిఖిల్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ లక్ష్మి మాధవి తదితరులు అక్కడికి చేరుకుని జెసిబి సహాయంతో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలను పూడ్చి వేశారు. అక్కడ ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

**కారిడార్ పనుల నాణ్యతపై అనుమానాలు :**
ఉప్పల్ ప్రధాన రహదారిలో సుమారు రూ.600 కోట్లతో చేపడుతున్న ఎలివేటెడ్ కారిడార్ పనుల నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రోడ్డు మధ్యలో గతంలో వేసిన మంచినీటి పైప్‌లైన్లు అదే విధంగా వదిలివేశారు. గత సిఎం మర్రి చెన్నారెడ్డి హయాంలో ఉప్పల్ నుంచి బోడుప్పల్ వరకు నీటిని తరలించేందుకు పైపులు వేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. వీటిని ఉపయోగించకపోవడంతో పైపులు శిధిలావస్థకు చేరుకున్నాయి. పిల్లర్ల వద్ద గుంతలు తవ్విన సమయంలో అక్కడ మాత్రమే పూడ్చివేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న పైపుల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. గత పదేళ్లుగా సాగుతున్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు ఒక అడుగు ముందుకు, మరో అడుగు వెనక్కి అన్న చందం గా సాగుతున్నాయి. ఉన్నతాధికారులు దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వరకట్న వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య..

**కొంపల్లి, జూలై 16, ప్రభాతవార్త :**
దేవేంద్రనగర్ సాయినగర్‌లో వరకట్న వేధింపులు తాళలేక అరుణ (26) అనే గృహిణి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుంకరి అరుణ, యర్రగలన్ల గోపిలకు దేవేందర్ నగర్, సాయినగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి 2017 సంవత్సరంలో పెద్దలు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో బంగారం, నగదు, గృహోపకరణాలు కట్నంగా ఇచ్చారు. ఇద్దరు కూతుళ్ల సంతానం తర్వాత అరుణ భర్త గోపి మరింత కట్నం కోసం వేధించే వాడని పెళ్లయిన తరువాత చాలాసార్లు అరుణ తమ కుటుంబం సభ్యులకు చెప్పేది. సోమవారం సుమారు 13గంటల సమయంలో యర్రగల్ల గోపి తమ మామ సుంకర బిక్షపతికి ఫోన్ చేసి మీ అమ్మాయి చనిపోయిందని తెల పడంతో వెంటనే భిక్షపతి వచ్చేసరికి మృతదేహం లేదని, పోస్టుమార్టం నిమి త్తం గాంధీ ఆసుపత్రికి తరలించారని తెలిపారు. తన కుతురు మరణానికి అల్లు డు గోపి కారణమని, మానసిక క్షభకు గురి చేసి ఆమె ఆత్మహత్య చేసుకునేలా చేశా డని, గోపిపై చర్యలు తీసుకోవాలని అరుణ తండ్రి బిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

# భారీ వర్షాలతో తీవ్ర ఇక్కట్లు..

**-సకాలంలో స్పందించని అధికార యంత్రాంగం..**
**-భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా తూతూ మంత్ర చర్యలు**



**పంజగుట్ట, జూలై16 (ప్రభాతవార్త):**
భారీ వర్షాలతో నగర వాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నా అధికార యంత్రాంగం తాము చేయాల్సిన పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నగరంలోని ప్రధాన ప్రాంతాలైన పంజగుట్ట, అమీర్‌పేట, ఎస్‌ఆర్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాలలో చన్నపాటి వర్షానికే రోడ్లన్నీ మోకాలి లోతు వరకు నీటితో జలమయమవుతున్నాయి. భారీ వర్షాలు కురుస్తాయని నగరంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినా ఆ దిశగా సీరియస్‌గా అధికారులు పనిచేయడంలేదనే విమర్శలు వస్తున్నాయి. జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, హెచ్ఎండిఏ, డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, ఇతర విభాగపు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే పలుమార్లు నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నంప్రభాకర్ విజ్ఞప్తులు చేస్తున్నా ఆ దిశగా చర్యలు మాత్రం తూతూ మంత్రంగానే ఉంటున్నాయని పలువురు నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో భారీ వర్షాలు కురిసినపుడు ఉత్పన్నమైన భయానక పరిస్థితులను బేరీజు వేసుకుని తదనుగుణంగాచర్యలు చేపట్టకపోతే కుండపోత వర్షం కురిసినపుడు నగర వాసులు నరకయాతన అనుభవిస్తారని బంజారాహిల్స్‌కు చెందిన ఓవ్యాపారి ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలలో ఇబ్బందులు లేకుండా చూడడం, ప్రాణనష్టం జరగకుండాచూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. భారీ వర్షం కురిసినపుడు నీళ్లు నిల్వ ఉండే లాగింగ్ పాయింట్స్ వద్దజీహెచ్ఎంసీ సిబ్బంది ఉండి నీళ్ళు వెంటనే వెళ్ళేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. ఎక్కడైతే భారీ వర్షం కురిసి ఇబ్బందులుఉన్నాయో ఆయా ప్రాంతాలలో అధికారులు ప్రజలు ఫిర్యాదులు చేసిన వెంటనే స్పందిస్తే కొంతలో కొంత సమస్యలు తగ్గే అవకాశంఉంది. భారీ వర్షం కురిసిన సమయంలో లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయడం, పాత భవనాలలో నివశించేవవారినిఖాళీ చేయించడం అధికారులు విధిగా బాధ్యత తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. గతంలో జరిగిన సంఘటనలె పునరావృతం కాకుండా చూసుకోవడంతో పాటు భారీవర్షం కురిసినపుడు విద్యుత్ స్తంభాల వద్ద ప్రమాదాలు జరుగకుండా విద్యుత్ శాఖ అధికారులునిరంతరం అప్రమత్తంగా ఉండవలసిన అవసరం కూడా ఎంతైనా ఉంది. వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తే భారీ వర్షం లాంటి విపత్తుల నుండి ప్రజలను ఈజీగా బయట పడేయవచ్చునిపలువురు నగరవాసులు వ్యాఖ్యానించారు.

# ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించబోం

**-అధికారులు కార్పొరేటర్లు సమన్వయంతో పనిచేయాలి**
**-మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ**



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

**హైదరాబాద్, జూలై 16,ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు కలిగిన సంహించబోమని ,అధికారులకు అప్రమత్తంగా పనిచేయాలని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అన్నారు. ఈమేరకు మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బోరబండ కార్పొరేటర్ బాబా మొహమ్మద్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి శేరిలింగంపల్లి జోన్ -యూసఫ్‌గూడ సర్కిల్ బోరబండ డివిజన్‌కు సంబంధించిన అభివృద్ధి పనులపై సంబంధిత జిహెచ్ఎంసి అధికారులు, ఎలక్ట్రికల్ ,వాటర్‌వర్క్స్, ఎంటమాలజీ, టౌన్‌ప్లానింగ్ , శానిటేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టిసారించి ప్రజలకు ఇబ్బదులు కలగకుండా ఎవరిపనివారు చేస్తూ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బోరబండ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాళ్లనిర్మాణం సిసిరోడ్ల పనులు, బోరబండ ప్రధాన రోడ్డు వైండింగ్, వీధిదీపాల నిర్వాహణ, శానిటేషన్ నిర్వాహణ తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులకు పలుసూచనలు చేశారు. వర్షాకాలంలో ఏఒక్క ప్రాణనష్టం జరగవద్దని, షార్టు సర్క్యూట్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్ని ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా గుర్తించి డార్క్ ఏరియాలో వీధిలైట్లను ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. అలాగే చెరువులల్లో గుర్రం డెక్కను తొలగించాలని, రోడ్ల పెండింగ్ పనులు ప్రాధాన్యత పరంగా చేపట్టడానికి మంజూరైన, పెండింగ్‌లో ఉన్న పనుల వివారలను అందించాలని డిసికి సూచించారు. అలాగే నాలాలకు సిల్టింగ్ ఎక్కడ అడ్డంగికా ఉండరాదని, ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించబోమని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అలాగే జివిపిల వద్ద గార్బేజి ఉండవద్దని , శానిటేషన్ నిర్వాహణ సక్రమంగా ఉండాలన్నారు. అందుకు రాంకీ సేవలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో యూసుఫ్‌గూడ డిసి సేవా ఇస్లావత్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి జిఎం హరిశంకర్, డిజిఎం వాహెద్, మేనేజర్లు శ్రీనివాస్, రాజేందర్, ఈఈ నాగరాజు, ఏఈ భరత్, ఏఎంహెచ్‌వో కవిత తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు



**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:**
మొహరం పండుగ సందర్భంగా శాంతి భద్రతలకై బుధవారం నగరంలోని ట్రాఫిక్ ఆంక్షలు ప్రకటించారు పోలీసు అధికారులు. ఈ మేరకు పలు ప్రాంతాల్లోని ట్రాఫిక్‌ను దారి మళ్ళించనున్నారు. ఉదయం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉంటాయని నగర ట్రాఫిక్ అదనపు కమీషనర్ పి.విశ్వప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. వందల మంది ముస్లీమ్ భక్తులు మొహరం సమయంలో జరిగే వార్షిక ఊరేగింపు బీబీకా ఆలంలో పాల్గొంటారని, ఈ క్రమంలో వారికీ, వాహనదారులకూ ఆటంకం కలుగకుండా నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎస్ఆర్‌టీసీ, టీజీఎస్ ఆర్‌టీసీ బస్సులను ఉదయం 10 గంటల నుంచి ఊరేగింపు ముగిసే సమయమైన రాత్రి 9 గంటల వరకూ రంగమహల్, అఫ్జల్ గంజ్ వైపు మళ్ళించనున్నట్లు తెలిపారు. ట్యాంక్‌బండ్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను కవాడీగూడ చిల్డ్రన్స్ పార్క్ వైపు మళ్ళిస్తారు. మహాత్మా గాంధీ రోడ్ నుంచి రాణీగంజ్ వచ్చే ట్రాఫిక్‌ను వన్‌వే చేసి, అక్కడి నుంచి కిమ్స్ ఆసుపత్రి వైపుగా మళ్ళిస్తారు. ఓల్డ్ సిటీలోని డబీర్‌పురా ప్రాంతంలో వార్షిక ఊరేగింప ప్రారంభమయ్యే చోట వచ్చే వాహనాలను గంగానగర్, దర్వాజా, యాకుత్‌పురా ప్రాంతాలకు మళ్ళించనున్నట్లు తెలిపారు. షేక్‌ఫైజ్ కమాన్ వైపు వచ్చే వాహనాల రాకని చంచల్‌గూడా వైపుకు మళ్ళిస్తారు. యాకుత్‌పురా ఎతేభార్ చౌక్ నుంచి వచ్చే వాహనదారులను బడాబజార్ వైపు మళ్ళించి, పరిస్థితులను బట్టి పురాణా హవేలీ ప్రాంతం వైపు దారి వదులుతారు. గంగానగర్ వద్దకు ముస్లీమ్‌ల వార్షిక ఊరేగింపు రాగానే, పురాణా హవేలీ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను చట్టా బజార్, డబీర్ పురా, ఎస్.జే రోటరీ వైపుగా, మొఘల్ పురా నుంచి వచ్చే ట్రాఫిక్‌ను బీబీ బజార్ ప్రాంతం వైపుగా తరలించనున్నారు. అదే విధంగా మదీనా నుంచి వచ్చే ట్రాఫిక్‌ను గుల్జర్ హౌస్ వైపు డైవర్ట్ చేస్తారు. ముస్లీమ్‌ల ఊరేగింపు ఛార్మినార్ ప్రాంతానికి చేరంగానే, నయాపూల్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను సిటీ కాలేజ్ వైపు మళ్ళిస్తారు. అదే విధంగా చాదర్‌ఘాట్, సాలార్జంగ్ మ్యూజియం, శివాజీ బ్రిడ్జ్‌ల వైపు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఛాదర్‌ఘాట్ బ్రిడ్జ్ మీదుగా రంగా మహల్, కోఠీ ప్రాంతాలకు మళ్ళిస్తారు. పోలీసులకు సహకరిస్తూ ఈ నిబంధనలను పాఠించి వాహనదారులు తమ గమ్యాన్ని చేరాలని అడిషనల్ కమీషనర్ ఉత్తరువులో తెలియజేశారు.

## టప్పాచబుత్ర పిఎస్‌లో ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ళు సస్పెన్షన్

**మెహిదీపట్నం, జులై 16, ప్రభాతవార్త :**
ఓ వ్యాపారిని బెదిరించిన కేసులో టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్.ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్ళను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 4న సుల్తాన్ బజారుకు చెందిన మనీశ్ కుమార్ అనే ఔషధ వ్యాపారిపై ఎలాంటి ఫిర్యాదు లేనప్పటికి ఎస్.ఐ అబ్దుల్ ఆదిల్, కానిస్టేబుల్ రాజేష్, హెడ్ క్వార్టర్స్‌కు చెందిన మరో ఏ.ఆర్ కానిస్టేబుల్ బాలరాజ్‌లు కారణం లేకుండా అతన్ని ఇంట్లో నుండి బలవంతంగా తీసుకుపోయారని కుటుంబసభ్యులు సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ విషయంపై పోలీస్ ఉన్నతా ధికారుల విచారణలో సంబంధిత ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ళు ఫిర్యాదు లేనప్ప టికి బలవంతంగా మనీశ్‌కుమార్‌ను తీసుకెళ్ళినట్లు తేలడంతో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ ఏ.రాములు తెలిపారు.

## మహిళ నుంచి 9.5 కేజీల గంజాయి చాక్లెట్లు స్వాధీనం..



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

**జగద్గిరిగుట్ట, జూలై 16, ప్రభాతవార్త**
జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని లెనిన్ నగర్‌లో ఒక కిరాణం షాప్‌లో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నట్లు సమాచారంతో సునీత దేవి గోస్వామి అనే మహిళను అదుపులోకి తీసుకున్న బాలానగర్ ఎస్ఓటి పోలీసులు కిరాణా షాప్‌లో 9.5 కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భక్తుల చెంతకే అమ్మ వారి ఘటం

**బేగంపేట జూలై 16,ప్రభాతవార్త**

భగవంతుని మొక్కేందుకు భక్తులు ఆలయాలకు వెళుతుంటారు. కానీ సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడబో నాలలో భాగంగా ఘటం ద్వారా అమ్మ వారు భక్తుల చెంతకే వస్తారు.ఆషాడ బోనాల జాతరలో భాగంగా ప్రతి ఏటా శ్రీఅమ్మ వారి ఘటోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.ఈ ఏడాది 7వ తేదీన అమ్మ వారి ఘటోత్సవ కార్యక్రమాన్ని శ్రీఉజ్జయినీ మహాకా ళీ ఆలయం వద్ద దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లు అంగ రంగ వైభవంగా ప్రారంభించారు.ప్రతి రోజు ఉదయం అమ్మ వారి ఘటం ఉదయం గం 10లకు దేవాలయం నుంచి బయలు దేరి రాత్రి గం 7లకు దేవాలయానికి చేరుకుంటుంది.7వ తేదీన అమ్మ వారి ఆలయం వద్ద బయలు దేరి కర్బాలా మైదానంలోని అమ్మ వారి ఆలయానికి చేరుకుని ఘటం అలంకరణ పూర్తి చేసుకుంది.8వతేదీన హిమంబావి,డొక్కులమ్మ దేవాలయం, 9నకళాసీగూడా,10న నల్లగుట్ట,11న పాన్‌బజార్,12న ఓల్డ్‌బోయి గూడా,13న రంగ్రేజీబజార్,14న చిలకలగూడా,15న ఉప్పరబ స్తీ,16న కుమ్మరిగూడా,17న రెజిమెంటల్ బజార్,18న ఘటము ఏ వీధిలోకి వెళ్లకుండా ఆలయంలోనే ఉంటుంది.19న బోయిగూడా ఏరియాకు ఉదయం గం 10లకు దేవాలయం నుంచి బయలు దేరి 20వతేదీన శనివారం రాత్రి గం 7లకు దేవాలయానికి చేరుకుం టుంది.దేవాలయానికి చేరుకుంటుంది.అమ్మ వారి ఘటము ఆయా ప్రాంతాలకు వచ్చినప్పుడు ఆ ప్రాంతంలోని గ్రామ దేవత ఆలయంలో దింపడం జరుగుతుందని,భక్తులు అక్కడికి వచ్చి తమ మొక్కుబడులు,ఒడిబియ్యం ,పసుపు,కుంకుమలు సమర్పించి సహకరించాలని అసిస్టెంట్ కమీషనర్,ఆలయ కార్యనిర్వహణా ధికారి జి.మనోహర్‌రెడ్డి కోరారు.

### బల్కంపేట్‌లో శివసత్తులు, పోతురాజులకు అవమానం

**-మహంకాళి బోనాల పండగను చేయం : జోగిని శ్యామల**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జోగిని శ్యామల, శివసత్తులు

**హైదరాబాద్, జూలై 16,ప్రభాతవార్త:**

బల్కంపేట్ కళ్యాణంలో రాతోత్సవ కార్యక్రమంలో పోతురాజు లకు, శివసత్తులకు అవమానం జరిగిందని జోగిని శ్యామల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల ఆమె మాట్లాడారు. రాతోత్సవం లో జోగినిలు, శివసత్తులపై లాఠీఛార్జ్ చేసి అవమానించా రన్నారు. మమ్మల్ని కొట్టినందుకు మేం మనస్థాపానికి గురయ్యా మని చెప్పుకొచ్చారు. రాజు బాగుండాలని, రాష్ట్రం బాగుండాలని మేము అమ్మవార్లను పూజిస్తాం ..అలాంటిది మమ్ముల్ని అడ్డుకో వడం ఏంటని ప్రశ్నించారు. తమను అవమానించి అడ్డుకు న్నందుకు ఈసారి మహంకాళీ అమ్మవారికి శివసత్తులు, జోగినీ లు బోనాల పండగను చేయమన్నారు. ప్రభుత్వం తమ సమస్య లను పరిష్కరిస్తేనే తాము బోనాలను తీసుకువస్తామని పేర్కొ న్నారు. శివసత్తులు, పోతురాజులను గౌరవించాలని తమను గుర్తించేందుకు విఐపి పాసులు ఇవ్వాలని ప్రభుత్వాన్నికోరారు. అలాగే అధికారికంగా ఒకమిటీని నియమించి అందులో తమను కూడా తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### నిరుద్యోగ డిమాండ్లపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి

**-రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, నీలవెంకటేష్, వేములరామకృష్ణ తదితరులు

**హైదరాబాద్, జూలై 16,ప్రభాతవార్త:**

నిరుద్యోగ డిమాండ్లపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందిచాలని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బిసిసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం విద్యానగర్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారానికి నిరుద్యగులు చేస్తున్న ఉద్యమాన్ని వక్రీకరించి ఎదురుదాడి దిగడం సమంజసం కాదన్నారు. అలాగే అశోక్‌నగర్, చిక్కడపల్లి లైబ్రరీల్లో నిరుద్యో గులపై లాఠీ ఛార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస మస్యలపై ఉద్యమం చేసే హక్కు వ్యక్తితోపాటు ప్రతిరాజకీయ పార్టీకి, ప్రతి ప్రజాసంఘానికి ఉందని దీన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ముఖ్యంగా నిరుద్యోగుల డిమాండ్లైన గ్రూప్ మెయిన్స్ పరీక్షలకు 1:100 నిష్పత్తి ఎంపిక చేయాలని అలాగే రిజర్వేషన్లలో అమలులో ఎస్సీ,ఎస్టీ,బిసిలకు జరుగుతున్న అన్యాయాలపై చర్చించాలన్నారు. అలాగే గ్రూప్1 సర్వీస్ కింద 563 పోస్టులనుంచి 1600లకు పెంచాలని ,గ్రూప్2లో 780 నుంచి 2వేలకు, అలాగే గ్రూప్3 పోస్టులను 1100 నుంచి 3వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా టీచర్ పోస్టులను 11వేల నుంచి 25వేలకు పెంచి డిఎస్సిని రెండునెలలపాటు వాయిదా వేయాలని అందుకు సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, మోదీ రాందేవ్ , శివకృష్ణ ముదిరాజ్, వీరన్న, మణి కంఠ, మధు,సాయి కృష్ణయాదవ్,మహేష్, వంశీ పాల్గొన్నారు.

### వేణు గోపాల్‌కు మగ్దుం మొహియుద్దీన్ పురస్కారం



సిటీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్.అమ్మంగి వేణు గోపాల్‌కు మగ్దుం మొహియుద్దీన్ జాతీయ అవార్డు ప్రధానం చేస్తున్న దృశ్యం

**చార్మినార్,జూలై 16 ప్రభాతవార్త :**

హైదరాబాద్ పాతబస్తీ ప్రభుత్వ సిటీ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బహుముఖీన సాహితీవేత్త డాక్టర్.అమ్మం గి వేణు గోపాల్‌కు ప్రముఖ రచయిత్రి డాక్టర్ సుజాతరెడ్డి,సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్‌లు కలిసి మగ్దూం మొహియుద్దీన్ జాతీయ అవార్డును ప్రధానం చేశారు.సిటీ కళాశాల పూర్వ అధ్యాపకులు మగ్దుం మొహియుద్దీన్ పేరుతో ఈ జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డు కింద పదివేల రూపాయల నగదు,జ్ఞాపికను అందజేసి డాక్టర్ ఆమ్మం గి వేణుగోపాలను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి యాకూబ్,రామారావు,సూర్య ప్రకాష్,అవార్డు కమి టి కన్వనర్ డాక్టర్.విప్లవ దత్ శుక్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.

# 2008 డిఎస్సీ, డిఎడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి

**-మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌లకు డిఎడ్ అభ్యర్థుల వినతి**



2008 డిఎస్సీ,డిఎడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మెమోరండం అందజేసిన దృశ్యం

**వికారాబాద్ జూలై 16,ప్రభాతవార్త :**

2008, డిఎస్సీలో క్యాలిపై అయిన ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయా లని ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులు మంగళవారం నాడు హైదరాబాద్‌లోని రాష్ట్ర రవాణా శాఖ క్యాబినేట్ మంత్రిని, తెలంగాణ రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి మెమోరండం అందశారు.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడు తూ. గతంలో డిఎడ్, 2007, 2009, ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులు 2008, డిఎస్సీలో వెలువడిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వ డిఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చారు. కానీ ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని అప్పడి కాంగ్రెస్ ప్రభుత్వాని కొరడం జరిగిందని కానీ ప్రభుత్వం తప్పిదం వల్ల ప్రభుత్వ డిఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చారు. కానీ ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులకు 2008, డిఎస్సీ లో అవకాశం ఇవ్వలేదని దింతో అభ్యర్థులంతా కోర్టును ఆశ్రయించడం జరిగింద న్నారు.దింతో అభ్యర్థులంతా కోర్టు ఆర్డర్ ద్వారా 2008,డిఎస్సీలో అభ్యర్థులు అందరు పరీక్ష రాయడం జరిగిందన్నారు.2008, డిఎస్సీలో సెలక్షన్ లిస్టు ,మెరిట్ లీస్టులో పేర్లు నమోదు అయి ఉన్నాయని ఒరిజినల్ సర్టిఫికేట్స్ కుడా వేరిఫికేషన్ చేయడం జరిగిందని ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులకు కోర్టు ద్వారా సెలక్షన్ అయిన అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విత్‌ఓల్డ్‌లో పెట్టి అప్పటి ప్రభుత్వం అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసిందని మంత్రికి, స్పీకర్‌కు వివరించడం జరిగిందన్నారు. దింతో కోర్టు అర్డర్ ఇచ్చిన అప్పటి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వ కుండా మాకు తీవ్ర అన్యాయం చేయడం జరిగిందన్నారు.2008, డిఎస్సీలో కోర్టు ద్వారా పరీక్షలు రాసిన అభ్యర్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 2008, డిఎస్సీలో అభ్యర్థులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రైవేట్ డిఎడ్ అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్‌లో కుడా డిఎడ్ చేసిన వారు 78 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని క్యాబినేట్ మంత్రికి, రాష్ట్ర సభాపతికి వివరించడం జరిగిదన్నారు. దింతో రాష్ట్ర రవాణా శాఖ క్యాబినేట్ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ 2008, డిఎస్సీలో ఎంతమంది ఉన్నారో ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వారు పేర్కోన్నారు, ఈ కార్యక్రమంలో రఘు, కిషోర్, ప్రవీణ్, రాంప్రసాద్,రవి, వెం కటేష్, సురేందర్, శ్రీనివాస్, కవిత, అనూష, మంజుల, విజయశ్రీ, లత, శ్రీలత, సునీత, సంధ్య, తదితరులు పాల్గోన్నారు.

# డిఎస్సీపై బిఆర్ఎస్ కుట్రలకు తెరలేపడం తగదు

**-సిఎం రేవంత్‌రెడ్డి 35వేల ఉద్యోగాలు భర్తీ చేశారు**

**-యువజన కాంగ్రెస్ నాయకులు రెడ్డి శ్రీనివాస్,కృష్ణంరాజు**



సమావేశంలో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ నాయకులు

**కొడంగల్,జూలై 16ప్రభాతవార్త**

రాష్ట్రంలో కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 35 వేల ఉద్యోగాల భర్తీతో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తు ఓపక్క నిరుద్యోగులకు సీఎం మేలు చేస్తుంటే మరోపక్క బీఆర్ఎస్ నాయకులు కుట్రలకు తెర లేపుతుండడం తగదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు రెడ్డిశ్రీనివాస్‌లు హితవు పలికారు. మంగళ వారం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో వారు విలేకరులతో మాట్లాడుతు మాజీ మంత్రి కేటీఆర్ నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని ప్రయత్ని స్తున్నాడని ఆరోపించారు.గత బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదని,10 ఏళ్ళ బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాల నోటిఫికేషన్‌లు లేకపోవ డంతో పాటు ఉద్యోగాల భర్తీ చేపట్టక పోవడంతో నిరుద్యోగులు రోడ్డున పడ్డారని విమర్శించారు.డిఎస్సీపై కేటీఆర్ ప్రైవేట్ సైన్యంతో పాటు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వంపై బురుదజల్లే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు.ఉద్యోగాల కోసం ఎన్నో ఏళ్ళుగా నిరీక్షించిన నిరుద్యోగుల అవస్థలను తొలగించాలనే సదుద్దేశ్యంతో సీఎం రేవంత్‌రెడ్డి డిఎస్సీ నిర్వహణకు చర్యలు తీసుకుంటే బీఆర్ఎస్ అడ్డుకోవాలని ప్రయత్నిస్తుండడం సిగ్గుచేటన్నారు.డిఎస్సీ పరీక్షలను వాయిదా వేస్తే నిరుద్యోగులకే నష్టం చేకూరడంతో పాటు ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు.2022లో గ్రూపు-2 పరీక్షలు,డిఎస్సీ పరీక్షలను వాయిదా వేసి నిరుద్యోగుల ఆశలపై నీళ్ళు చల్లిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలుస్తుందని,అందులో భాగంగా ప్రతి సంవత్సరం జ్యాబ్ కా ్యలెండర్‌ను విడుదల చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు.అంతేగాక రానున్న 6 నెలల్లో మరో డిఎస్సీ ద్వారా సుమారు 10వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం సిద్ధం గా ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారని తెలిపారు. నిరు ద్యోగులు ఇప్పటికైనా ఆలోచించాలని అధైర్యపడకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండ గా ఉండాలన్నారు.సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్,తార్యానాయక్,అర్గె ఓంప్రకాష్,భీంరాజ్,సయ్యద్ అశ్వాక్ పాల్గొన్నారు.

### లైంగిక దాడులకు పాల్పాడే వ్యక్తులను కఠినంగా శిక్షించాలి : డా.శిల్పారెడ్డి

**బోడుప్పల్, జూలై 16 (ప్రభాతవార్త) :** పిల్లలు, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో డ్యాన్స్ మాస్టర్ 1వ తరగతి చదువుతున్న చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడటం పట్ల తల్లిదం డ్రులతో కలిసి మంగళవారం ఉదయం పాఠశాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. టీచర్లను నియమించుకునే ముందు వారి గురించి తెలుసుకోకుండా ఎలా నియమిస్తారని నిలదీశారు. పాఠశాల ఆవరణలో సిసి కెమెరాలు ఎందుకు పనిచేయడంలేదని ప్రశ్నిం చారు. పిల్లలు ఆడుతున్నప్పుడు, ఇతర ఈవెంట్లలో పాల్గొనేటప్పుడు అబ్జర్వర్లను నియ మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పాఠశాల యాజ మాన్యాన్ని గట్టిగా నిలదీశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం బంజారాహిల్స్‌లోని పాఠశా లలో ఇటాంటి సంఘటన జరిగితే స్కూల్‌ను మూసి వేశారని గుర్తు చేశారు. ఇటీవల అల్వాల్‌లో మహిళపై అత్యాచారం జరిగిందని అన్నారు. మహిళలు, పిల్లలు ఎక్కడికి వెళ్లకూడదా?. అని ప్రశ్నించారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులతో స్కూల్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కమిటీ నుండి ప్రతి నెల సలహాలు, సూచనలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ధర్నాలో మహిళా మోర్చతో ప్రతినిధులతోపాటు బిజెవైఎం, బిజెపి నాయకులతోపాటు విద్యార్థుల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సబితాఇంద్రారెడ్డిని కలిసిన జడ్పిటిసి అవినాష్ రెడ్డి



సబితాఇంద్రారెడ్డిని కలిసిన షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి

**షాబాద్, జూలై 16, ప్రభాతవార్త :** మహేశ్వరంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో షాబా ద్ మండలానికి చెందిన బీఆర్ ఎస్ నాయకులు, జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి నేతృత్వం లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనుస రిస్తున్న ప్రజావ్యతిరేక ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై పోరాదుతున్న సబితాఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డికి అండగా,మద్దతుగా ఉంటామన్నారు.

### సిఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే కాలె యాదయ్య



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసిని అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

**షాబాద్, జూలై 16, ప్రభాతవార్త :**

సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం షాబాద్ మండల ముద్దెంగూడ గ్రామానికి చెందిన జె.లక్ష్మి క్యాన్సర్ వ్యాది చికిత్స చేయించుకుంటున్న సందర్భంగా రూ.2లక్షల50వేలు సీఎం ఆర్ఎఫ్ ఎల్ఓసీని అంద జేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సున్నపు వసంతం, షాబాద్,చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, వీరేందర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య, నాయకులు రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, పెంట య్య, శేఖర్, జానీ, శ్రీనివాస్, రవి, కుమార్ తదితరులు ఉన్నారు.

### 420 కేసుల్లో నిందితుడు ఉద్యోగాల పేరుతో వల

**హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త:**

అతడో పాత నేరస్థుడు. వివిధ ఘటనల్లో 420 కేసుల్లో నిందితుడు. ప్రముఖ సంస్థలో సీనియర్ అధికారినని చెప్పి కొందరు నిరుద్యోగులకు నకిలీ ఆఫర్ లెటర్లు ఝారీ చేశాడు. అనంతరం వారి నుంచి రూ.5లక్షలు కాజేసి ఉడాయించాడు. సైబరాబాద్ డీసీపీ శిల్పవల్లి కోగంటి తెలిపిన వివరాల ప్రకారం, నందిగామకు చెందిన కిలేరు సీతయ్య(35) నౌకరీ, లింక్డ్ ఇన్ వంటి సైట్లనుంచి నిరుద్యోగుల కాంటాక్ట్‌లు, జాబ్ ప్రొఫైల్ వివరాలు సేకరించి నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించాడు. తనని తాను ఎరిక్సన్ గ్లోబల్ ఇండియా కంపెనీలోని సీనియర్ హెచ్.ఆర్ మేనేజర్‌గా పరిచయం చేసుకున్న నిందితుడు ఆరంభంలోనే అభ్యర్థులకు సెక్యూరిటీ కింద కొంత మొత్తం చార్జ్ అవుతుందని చెప్పాడు. అతడు చేసిన ఇంటర్వ్యూ పద్దతి, చెప్పిన కంపెనీ ప్రొఫైల్ వివరాలు, ఇచ్చిన జాయనింగ్ లెటర్లు నకిలీవని అభ్యర్థులు గుర్తించలేకపోయారు. అనంతరం తమ వద్దనున్న ఆఫర్ లెటర్లతో సంబంధిత ఎరిక్సన్ గ్లోబల్ ఇండియా కార్యాలయానికి డేట్ ఆఫ్ జాయనింగ్ రోజు వెళ్ళగా అవి నకిలీవని తేలడంతో నిరుద్యోగ బాధితులు తాము మోసపోయినట్లు గ్రహించి సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు వివిధ ఆధారాలతో నిందితుడిని గాలించి పట్టుకుని పాత నేరస్థుడిగా గుర్తించారు. గతంలో వివిధ మోసాల్లో అతడిపై 420 కేసులు నమోదయినట్లు తెలిపారు. అతడు బాధిత ఉద్యోగుల నుంచి దోచేసిన రూ.5,64,980 నగదును బెట్టింగ్ యాప్‌లలో పెట్టినట్లు తెలిసింది. నిందితుడి నుంచి ఒక ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

### అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలపై ద్వైపాక్షిక చర్చలు జరపాలి

**సైఫాబాద్, జూలై 16 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీల అమలుకు వారి సమస్యలు పరిష్కారానికి ద్వైపాక్షిక చర్చలు జరపాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని యూనియన్ తెలిపింది. దీనితోపాటుగా అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల రిటైర్‌మెంట్ బెనిఫిట్‌పై తక్షణమే జీవొను విడుదల చేయాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సాయీశ్వరి, నందూరి కరుణకుమారి, ఉప ప్రధాన కార్యదర్శి సి.హెచ్.సీతామహాలక్ష్మి మంగళవారం నాడిక్కడ పత్రి కలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సుదీర్ఘ కాలంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారిం చేందుకు ద్వైపాక్షిక చర్చలకు అన్ని యూనియన్ నాయకులను, వర్కర్లను ఆహ్వానించాలని, కోరారు. అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు ఇచ్చే పెన్షన్ 5 వేలుగా ప్రకటించి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

### అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ప్రజలను దగా చేస్తున్నాయి.

**సైఫాబాద్, జూలై 16 ప్రభాతవార్త:** ఏ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా సంక్షేమం, అభివృ ద్ధి, నిరుద్యోగం తదితర సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తరువాత దగా చేయడం పరిపాటిగా మారిందని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపిం చారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనన మాట్లాడుతూ ప్రధానంగా మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడం సహేతుకంగా లేదని, ఆదే విద్యా ర్థులకు పూర్తిస్థాయిలో బస్‌లలో ఉచిత ప్రయాణం కల్పిస్తూ, 55 సంవ త్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తే సబ బుగా ఉండేదని ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేశారు. నిరుద్యోగులు ఉద్యోగాలు అడిగితే పోలీసులతో కొట్టిస్తున్న రేవంత్‌రెడ్డి పాలన నాటి నిజాం పాలన జ్ఞప్తికి వస్తున్నదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలనను గాడిలో పెట్టకుండా ఢిల్లీ చుట్టూ తిరగడానికి సమయాన్ని వృదా చేస్తున్నారని, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలివేశారని, పిరాయింపులు ప్రోత్సహిసున్నారని ఆయన విమర్శించారు.

## డేటింగ్ యాప్‌లో పరిచయం

**బెట్టింగ్‌లలో డబ్బు మాయం**

**పోలీసుల అదుపులో నకిలీ పెళ్ళికొడుకు**

హైదరాబాద్, జూలై 16, ప్రభాతవార్త: గూగుల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నంటూ డేటింగ్, మ్యాట్రిమోనీ యాప్‌లలో మోసాలకు పాల్పడిన నిందితుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ క్రైమ్ డీసీపీ శిల్పవల్లి కోగంటి తెలిపిన వివరాల ప్రకారం, కర్నూలుకు చెందిన చిన్నిరెడ్డి శ్రీనాథరెడ్డి (23) 'టిండర్', 'నీతో' వంటి డేటింగ్ యాప్‌లలో సందీప్ సన్నీ పేరుతో నకిలీ ఖాతాలు తెరిచి, యువతులను టార్గెట్ చేసే క్రమంలో చాటింగ్‌లో పరిచయమైన బాధితురాలికి తననో యాప్ డెవలపర్‌గా పరిచయం చేసుకున్నాడు. ఈ పరిచయాన్ని స్నేహంగా మార్చి ప్రేమ పేరు చెప్పి పెళ్ళికి ఒప్పించాడు. ఈ క్రమంలో కుటుంబం లో జరిగిన విషాధ గాధలని, తప్పుడు కథనాలనీ చెప్పి బాధితురాలిని మభ్యపెట్టాడు. దాంతో అతడిని పూర్తిగా నమ్మిన ఆమె తన వ్యక్తిగత ఫొటోలను పంచుకోవడంతో పాటు నిందితుడికి పలు దఫాల్లో రూ.6,41,736 నగదు పంపించి చివరికి మోసపోయింది. అతడు ఈ మొత్తాన్నీ 'మెజిస్టిక్ ఫ్రైడ్', 'క్యాసినో ఫ్రైడ్' వంటి బెట్టింగ్ యాప్‌లలో పెట్టినట్లు తెలుసుకున్న బాధితురాలు తన వద్ద డబ్బు గుంజడానికి ఆమెతో ప్రేమ నాటకమాడాడని ఆలస్యంగా గ్రహించింది. దాంతో సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించగా, నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఇండియన్ పీనల్‌కోడ్ సెక్షన్ 420, ఐటీ యాక్ట్ సెక్షన్ 66 కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతడి నుంచి ఒక మొబైల్, నకిలీ పేరుతో ఉన్న సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

### మొహర్రం వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపిపి

**కొడంగల్,జూలై 16ప్రభాతవార్త :**

హిందు,ముస్లీం సోదరులు కులమతాలకతీతంగా ఐక్యమత్యంతో జరుపు కునే మొహరం వేడుకల్లో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పాల్గొని పీర్లకు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించిన అలీ అబ్బాస్,ఇమామే కాసీం పీర్లకు మంగళవారం ఎంపీపీ తదితరులు దట్టి పూల చాదర్‌లు సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిం చారు.ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ ఎస్.గౌసన్‌ను శాలువాతో సన్మానించారు.అనంతరం ఆయన మాట్లాడుతు 10 రోజుల పాటు కొనసాగుతున్న మొహరం ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు.కాగా మొహరం ఉత్సవాల చివరి రోజు నియోజకవర్గంతో పాటు హైద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పీర్లకు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ సందర్భంగా అసీఫ్‌ఖాన్, కరీం, అష్రఫీ,అబ్దుల్ ఖాదర్,ఎండీ.జావిద్ తదితరులు పాల్గొన్నారు.

### పాతబస్తీలో ఆషాడ ఏకాదశి మహోత్సవాలు



శ్రీ విఠలేశ్వర స్వామి దేవాలయం కమిటి ప్రతినిధులు పుస్తె శ్రీకాంత్,ఠాకూర్ రంజిత్ సింగ్ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**చార్మినార్,జూలై 16 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ పురానాపూల్ గల్బవీధిలో ఉన్న శ్రీ విఠలేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం నుంచి వైభవంగా ఆషాడి త్రిరాత్రి ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభ మయ్యాయి.మొదటి రోజున దేవాలయం కమిటి చైర్మన్ పుస్తె శ్రీకాంత్,వర్కింగ్ ప్రెశిడెంట్‌ఠాకూర్ రంజిత్ సింగ్,ఉపాధ్యక్షులు టి.నందలాల్ సింగ్,ప్రతినిధి సాయిగౌడ్‌తో పాటు పలువురు దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు.ఈ ఎందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ ఆషాడి త్రిరాత్రి ఏకాదశి మహోత్సలను వైభవంగా జరపటానికి అన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.18వ తేదీ గురువారం మధ్యాహ్నం శ్రీ రుక్మిణి సమేత విఠలేశ్వర స్వామి కళ్యాణం,సాయంత్రం ఐదు గంటలకు గల్బవీధిలోని శ్రీ విఠలేశ్వర స్వామి దేవాలయం నుంచి స్వామి వారి పల్లకి సేవా ఊరేగింపు ప్రారంభమై పలు ప్రాంతాలు మీదుగా కొనసాగిన అనంతరం తిరిగి మందిరానికి చేరుకుంటుందని వారు తెలియజేశారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆషాడి త్రిరాత్రి ఏకాదశి ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

### వన మహోత్సవంలో భాగస్వాములవుదాం

**- నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్**



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికి తిరిగి మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ నాగపూర్ణ, వైస్ ఛైర్మన్ విజయ్‌బాబులు.

**నార్సింగి, జూలై 16 ప్రభాతవార్త :**

వన మహోత్సవంలో భాగస్వాములం అవుదాం... వాతావరణంను కాలుష్యం నుంచి కాపాడుకుందామని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలలో వైస్ ఛైర్మన్ గోపాల విజయ్‌బాబు, కమీషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డిలతో కలిసి నాగపూర్ణ ఇంటింటికి తిరిగి మొక్కలు పంపిణీ చేశారు. వన మహోత్సవంను పండుగలా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడ అడువులు ఎక్కువగా ఉన్నాయో అక్కడే వర్షాలు అధికంగా కురుస్తాయన్నారు. భారీ చెట్లు మేఘాలను ఆకర్షించి వర్షింప చేస్తాయని, జలాశయాలు నిండి పంట లు సమృద్ధిగా పండుతాయన్నారు. అలాగే భూగర్భ నీటి మట్టం పెరుగుతుందని, వాతావరణంలోని కాలుష్యంను చెట్లు పీల్చుకొని వాతావరణంలోకి ఆక్సీజన్‌ను విడుదల చేస్తాయని వివరించారు. ప్రతీ ఒక్కరం మన ఇళ్ల వద్ద మన తల్లిల దండ్రులు గాని, బిడ్డల పేర్లు గాని పెట్టుకొని మొక్కలు నాటుదామని, వాటిని మూడేళ్లపాటు సంరక్షిస్తే అవి మనకు జీవితాంతం ఆక్సీజన్‌ను, నీడను, పూలు, పళ్లను ఇస్తాయని తెలిపారు. పెరుగుతున్న పట్టణీకరణ కారణంగా ఇప్పటికే ఇబ్బ డిముబ్బడిగా చెట్లు తొలగించామని, ఇప్పుడు మనం చేసిన తప్పును మనమే సరిది ద్దుకునే అవకాశం వనమహోత్సవం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి మనకు కల్పించారని, దీనిలో స్వచ్ఛందంగా పాల్గొందామని చైర్ పర్సన్ నాగపూర్ణ పిలుపునిచ్చారు.

### మంచినీటి కష్టాలు అధిగమించేందుకు చర్యలు

**-కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



మంచినీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జూలై 16: ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్‌లో మంచినీటి కష్టాలను అధిగమించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని గిరినగర్ ప్రాంతంలో మంచినీటి సరఫరాలో సమస్యలు, లోప్రెషర్ తదితర సమస్యలను వాటర్‌బోర్డు అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సరఫరా సమయంలో లోప్రెషర్‌ను నియత్రించేందుకు నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని బస్తీవాసులు కోరగా ఇందుకు కావాల్సిన కార్యాచరణ సిద్ధం చేస్తామనా న్నరు. ఈ విషయంలో అధికారులు చొరవచూపి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, వాటర్‌బోర్డు మేనేజర్ కృష్ణమోహన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శంకర్, బస్తీ వాసులు సాయికుమార్, శ్రీనివాస్, సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### మత్తుపదార్థాలను వినియోగాన్ని అరికట్టాలి

**-చిక్కడపల్లి ఎసిపి ఎల్.రమేశ్‌కుమార్**



ప్రసంగిస్తున్న చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్

**చిక్కడపల్లి, జూలై 16ప్రభాతవార్త:** మత్తుపదార్థాలను వినియోగాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిక్కడపల్లి పోలీసుసబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు ఎల్.రమేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం రామ్‌నగర్‌లోని సెయింట్‌పాయిస్ స్కూల్‌లో 'డ్రగ్స్ నిర్మూలిద్దాం సమాజాన్ని మేలుకొలుపుదాం' పేరుతో ప్రజానాట్యమండలి గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నిర్వహించిన ప్రచార కార్యక్రమాన్ని ఏసీపీ రమేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.కార్యక్రమంలో గాంధీ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్.ఎం.కాంతారావు,కమిటీ ప్రధాన కార్యదర్శి నాగటి మారన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎగ్జిబిషన్-కళాయాత్ర సెప్టెంబరు 16వరకు నిర్వహిస్తారు.

### పుప్పాలగూడలో ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి విడిపించిన అధికారులు

**నార్సింగి, జూలై 16 ప్రభాతవార్త :** గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామ సర్వే నెంబర్ 324.లో అక్రమంగా వేసిన రెండు కంటెనర్లను మంగళవారం రెవె న్యూ అధికారులు జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సర్వే నెంబర్‌లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు సదరు కబ్జాదారులు కంటెనర్లను ఏర్పాటు చేశారని, ఈ విషయం మా దృష్టికి రాగానే తొలగించడం జరిగిందని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూములు భావి పౌరుల అవసరాల కోసం ఉపయోగపడుతాయని,ఎవరూ కబ్జా చేయడానికి వీలు లేదన్నారు. కబ్జాల కు తెగబడితే కఠినంగా వ్యవహరిస్తామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ స్పష్టం చేశారు. ప్రజలు తమ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేస్తుంటే వెంటనే మా దృష్టికి తీసుకు రావాలని, మాకు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రభు త్వ ఆస్తులంటే ప్రజలందరి ఆస్తులన్న విషయంను అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు. సర్కారు భూములను కాపాడడంలో రెవెన్యూ అధికారులు వేగంగా స్పందిస్తున్న తీరుపై స్థానిక ప్రజలు సంతోషంను వ్యక్తం చేస్తున్నారు.

## రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడి ప్రీ ప్రైమరీలో చేర్పించాలి: మేయర్ పారిజాత


అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జూలై 16 ప్రభాతవార్త:** రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఐడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం 9వ డివిజన్ నాదర్‌గుల్‌లో అమ్మ మాట - అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల వయస్సు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడి కేంద్రాల్లోని ప్రీ-ప్రైమరీలో చేర్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో 15 నుండి 20వ తేదీ వరకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికి అమ్మ బాట - అంగన్‌వాడి బాట కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌లోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో అర్హులైన పిల్లలను చేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్, తోట శ్రీధర్‌రెడ్డి, భాగ్యనగర్ సొసైటీ వైస్ ఛైర్మన్ బంగారు బాబులతో పాటు బంగారు అశోక్, సుభాన్ యాదవ్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం నూతన కమిటీ సభ్యుల ఎంపిక


దేవాలయం నూతన కమిటీ సభ్యులు

**ఎల్.బి.నగర్, జూలై 16 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం డివిజన్ పిఅండ్‌టి కాలనీలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం నూతన కమిటీ సభ్యులను రాష్ట్ర దేవాలయ శాఖ డైరెక్టర్ ఎం.హనుమంతరావు ప్రకటించారు. దేవాలయ కమిటీ సభ్యులుగా బంగారు నాగరాజు, గుండా జయమ్మ, శంకర్‌రెడ్డి, సుజాతలక్ష్మి, శంకర్, శశికళ, శాంతిలను నియమిస్తూ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అందరూ కలిసి మంగళవారం బంగారు నాగరాజును చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో నూతన కమిటీని సన్మానించారు.

## ఈ నెల 20వ తేదీ నుంచి సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు

**ఎల్.బి.నగర్, జూలై 16 ప్రభాతవార్త:** దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీషిరిడిసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు శ్రీగురుపూర్ణిమ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ చైర్మన్ శ్యాంకుమార్ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా శ్రీసాయిబాబా వారికి మంగళస్నానము, అర్చన, వేదఆశీర్వచనము, శ్రీ గురుచరిత్ర పారాయణము, శ్రీ సాయి లక్షపుష్పార్చన, శ్రీగురుపాదుకపూజ, అఖండహారతి, అన్నప్రసాద వితరణ, శ్రీ సాయిచరిత్ర, నిత్యపారాయణము, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణము,ఓం సాయి శ్రీ సాయి జయజయసాయి నామ అఖండ ఏకాహము, మహాపూర్ణాహుతి, మహామంత్రపుష్పం, 108 మంది మహిళా భక్తులతో శ్రీ సాయికలశ దీపములతో శోభాయాత్ర తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

## అధికారులు సమన్వయంతో పని చేయాలి


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

**మల్కాజిగిరి, జూలై 15 ప్రభాతవార్త:** మల్కాజిగిరి డివిజన్ శివపురిలో కార్పొరేటర్ శ్రవణ్ తన కార్యాలయంలో ఇంజనీరింగ్, శానిటైజేషన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రదేశాలలో రోడ్డు, నాలా పనులతోపాటు, వ్యర్థాలు కాంట్రాక్టర్లు తొలిగించకపోవడంతో పారిశుధ్య సిబ్బంది సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని తొలగించే ప్రయత్నం చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా మారుతినగర్, సరికొండ నర్సింహారెడ్డి గార్డెన్స్ వద్ద వున్న వ్యర్థాలను వారం రోజుల్లో తొలగించి నాలా కంచెను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రమేష్, దీపక్, గిరి, అంజి, మాజీ కౌన్సిలర్లు ఆనంద్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ సందర్భంగా చెక్కుల పంపిణీ

**సైదాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** బోనాల పండుగ సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని అమ్మవారి దేవాలయాలకు ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్కులను ఎల్బీనగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, చింతల అరుణ సురేందర్ యాదవ్, కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం జీవన్‌రెడ్డి, బానోతు సుజాత నాయక్, నాయకోటి పవన్ కుమార్, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : భాగ్యలక్ష్మి


రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జూలై 15 ప్రభాతవార్త:** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో రూ. 5లక్షలతో నిర్మించనున్న నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. రానున్న బోనాల పండుగ సందర్భంగా పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సైట్ ఇంజనీర్, ఏడుకొండలు, సంతోష్, సాయియాదవ్, ఉమేష్, దినేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అరాచకాలు


సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

**ఎల్.బి.నగర్, జూలై 16 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అరాచకాలు మితిమీరిపోతున్నాయని బిఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ ఆరోపించారు. ప్రోటోకాల్‌ను అతిక్రమిస్తూ మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డిని అవమానపరిచే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ మంగళవారం ఆర్కేపురం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే సబితఇంద్రారెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఘోరపరాజయం చెందిన వ్యక్తిని ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో వేదికపైకి ఆహ్వానించి స్థానిక ఎమ్మెల్యేను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తే అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రజలను ఈరోజు రోడ్లపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అమలుకాని హామీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్నారు అనడానికి 15 సంవత్సరాల పాటు మంత్రిగా సేవలందించిన సబితఇంద్రారెడ్డిని అవమానించడమే అందుకు నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చూసి రైతులు నిరుద్యోగులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. బోనాల పండుగ చెక్కుల పంపిణీ కార్యక్రమం అధికారిక కార్యక్రమమా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలను అవమానిస్తే బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే తగిన చెబుతామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు లక్ష్మీనరసింహారెడ్డి, సురగంటి అర్జున్, రామిడి రామిరెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, కొండ్రు శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, వెంకటేష్, ఏనుగు రామ్‌రెడ్డి, జైశ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా విట్టా దూరయ్య


కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు

**వనస్థలిపురం, జూలై 15 ప్రభాతవార్త:** వనస్థలిపురం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మనోహర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ పస్ట్ వైస్ గవర్నర్ గంపా నాగేశ్వర్‌రావు, కమలాకర్, శ్యామ్‌లు హాజరయ్యారు. ముఖ్య అతిథుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షునిగా విట్టా దూరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జె.ఎస్ నంద కిషోర్, కోశాధికారిగా అత్తులూరి మల్లికార్జునరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 21న నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు.

## ఉపాధ్యాయులకు వీడ్కోలు, స్వాగత కార్యక్రమం


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీడ్కోలు, స్వాగత కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**తుర్కయంజాల్, జూలై 15 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యబోధన చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు అమూల్య సేవలందించి బదిలీపై వెళుతున్న 6గురు ఉపాధ్యాయులకు లయన్స్‌క్లబ్ రాగన్నగూడ వారి ఆధ్వర్యంలో వీడ్కోలు, బదిలీపై వస్తున్న 6 గురు ఉపాధ్యాయులకి వారి స్వాగత కార్యక్రమం లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ రాగన్నగూడ అధ్యక్షులు సామ భీంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ జిల్లా 320 సి జోనల్ ఛైర్మన్ లయన్ ఎల్మేటి వెంకట్‌రెడ్డి విచ్చేసారు. ఈ కార్యక్రమంలో రాగన్నగూడ లయన్స్ క్లబ్ సభ్యులు పూజారి శంకరయ్యగౌడ్, దాసరి సుధాకర్ రెడ్డి, జూపల్లి వెంకటేశ్వరరావు, సామ అల్వాల్‌రెడ్డి, ఉన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యావాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి : పిడిఎస్‌యు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

**మలక్‌పేట, జూలై 15 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజ రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్‌లు డిమాండ్ చేసారు. పిడిఎస్‌యు గ్రేటర్ కార్యవర్గ ఆధ్వర్యంలో దిల్‌సుక్‌నగర్‌లో సుమారు 300ల మంది విద్యార్థులతో కలిసి ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అవలంభించిన తీరునే ఈ ప్రభుత్వం అవలంభిస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ ఏర్పడి 7 నెలలు కావస్తున్నా ఫీజు బకాయిలు విడుదల కాలేదని, వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, గణేష్, శ్రీనిధి, పూజ, లత తదితరులు పాల్గొన్నారు.


బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ ఆంధ్ర కేసరినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, కాలనీ అధ్యక్షులు రవిశంకర్, శ్రీనివాసులు, వెంకటేష్‌యాదవ్ తదితరులు (ప్రభాతవార్త, వనస్థలిపురం)

## సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కార్పొరేటర్ బండారు శ్రీవాణి


సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**ఉప్పల్,జూలై 16 ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల నివారించేందుకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ పరిసరాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని, దోమకాటుకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తా చెదారం, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, ఇతర వస్తువులు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసి అంజనేయులు, శానిటేషన్ డిఇ చందన, ఎంటమాలజీ ఎఇ నరేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ సుదర్శన్. రాజేశ్వర్‌రెడ్డి, శానిటరీ జవాన్లు, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ నుండి రాజీవ్ గృహకల్ప బిటి రోడ్డు పనులు ప్రారంభం


బిటి రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

**సరూర్‌నగర్, జూలై 16 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ నుండి రాజీవ్ గృహకల్ప వరకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న బిటి రోడ్డు పనులను మంగళవారం మేయర్, పలువురు కార్పొరేటర్లు పరిశీలించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ రోడ్డు పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఇఇ వినీల్‌గౌడ్, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## శ్రీ కాశీ నర్మదేశ్వర ఆలయంలో ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు


వారాహి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ మాధవి, మహిళలు

**సరూర్‌నగర్, జూలై 16 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్ టిఆర్ఆర్ చౌరస్తాలోనున్న శ్రీ కాశీ నర్మదేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వారాహి దేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ఛైర్ పర్సన్ తీగల మోనారెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆషాఢమాస గోరింటాకు పండుగను జరిపారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్, వివిధ కాలనీల మహిళలు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల చెక్కులు అందజేత : చేతన

**ఉప్పల్, జూలై 16 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పలు ఆలయాల కమిటి నేతలను సోమవారం స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన చేతుల మీదుగా చెక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల ఉత్సవాల సందర్భంగా హబ్సిగూడ డివిజన్ లోని అన్ని ఆలయాల వద్ద వివిధఏర్పాట్లు చేస్తున్నామని, ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలని సూచించారు.

## కాంగ్రెస్ నాయకురాలు జయమ్మ మృతి

**సరూర్‌నగర్, జూలై 16 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ జయశంకర్ కాలనీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు బోయపల్లి జయమ్మ మృతి చెందారు. ఈ మేరకు సమాచారం అందుకున్న టిపిసిసి ప్రధానకార్యదర్శి,బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, తిరుమలేష్, సామ భాస్కర్‌రెడ్డి, అనిల్ తదితరులు జయశంకర్ కాలనీకి విచ్చేసి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన పారిజాత కొంత ఆర్థిక సాయాన్ని అందజేసి అండగా ఉంటామని తెలిపారు.

## సైదాబాద్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్ అరుణ


భూలక్ష్మినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

**సైదాబాద్, జూలై 15 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. భూలక్ష్మినగర్‌లో మంగళవారం పాదయాత్ర నిర్వహిస్తూ స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని బస్తీలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిగా విఘ్నేశ్వర్‌రెడ్డి


రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి సత్కరిస్తున్న కాంగ్రెస్ నేత ఎం.పరమేశ్వర్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 16 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిగా ఉప్పల్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఎం.విఘ్నేశ్వర్‌రెడ్డి నియమితులైయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో బేటి అయ్యారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి తనకు గొప్ప అవకాశం ఇచ్చారని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తానని విఘ్నేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిగా హైకోర్టులో సేవలు అందిస్తానని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కేటిఆర్‌తో కార్పొరేటర్ గీత బేటి


మాజీ మంత్రి కేటిఆర్‌తో బేటి అయిన కార్పొరేటర్ గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జూలై 16 ప్రభాతవార్త :** మాజీ మంత్రి కేటిఆర్‌ను మంగళవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ బేటి అయ్యారు. ఈ మేరకు కేటిఆర్‌ను కలిసి పలు అంశాలు చర్చించారు. చిలుకానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని, ప్రభుత్వం లేదనే బాధలేదని, ప్రజలతో నిత్యం కలిసి ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌యాదవ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 20వ తేదీ వరకు అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం..


అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**నేరేడ్‌మెట్, జూలై 16, ప్రభాతవార్త:** అమ్మమాట అంగన్‌వాడీ బాట అనే నినాదంతో మంగళవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయశీల ఆధ్వర్యంలో అంబేద్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాల నుండి అంగన్ వాడీ కేంద్రం వరకు చిన్నారులతో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల పేర్లను నమోదు చేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం పౌష్టికాహారాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన అమ్మమాట అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంలో 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ సి.హెచ్ భాగ్యలక్ష్మి, అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి: చింతల


ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అరుణసురేంద్రనాథ్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జూలై 16 ప్రభాతవార్త:** డివిజన్ పరిధిలో పెండింగ్లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. జలమండలి ఎండి అశోక్‌రెడ్డినీ కార్పొరేటర్ చింతల కలిసి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగోల్ డివిజన్‌లోని రామాంజనేయకాలనీ డ్రైనేజీ లైన్స్, సహదేవ్‌సింగ్‌నగర్ వాటర్‌లైన్స్, డ్రైనేజీలైన్స్ పనులను వెంటనే ప్రారంభించి భారీవర్షాలు రాకముందే తొందరగా పనులు పూర్తి చేయాలని కోరారు. నాగోల్ డివిజన్‌లో ప్రతికాలనీలో డ్రైనేజ్‌లైన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, కేసిరెడ్డి పద్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డివిజన్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలని, మంచినీరు కలుషితం అవుతుందని అవసరమైన నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జలమండలి జీఎం బలరాంనాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి (ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)